సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



రెప్పపాటులో మృత్యుఒడికి..

బస్టాప్ వద్ద కూర్చున్న తండ్రీకొడుకులను రెప్ప పాటులో మృత్యువు కబళించింది. లారీ వేగంగా దూసుకొచ్చి అదుపుతప్పి బోల్తాపడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. 8లో▸



కృష్ణాష్టమి సంబురం 9లో▸

కృష్ణాష్టమి సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, ఆలయాలు, గ్రామాల్లో సంబరాలు నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.0 /25.0

ఉదయం వేళ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థిని ఉన్నత విద్యకు ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ సుమన్

కోటపల్లి: మండలంలోని సిర్సా గ్రామానికి చెందిన ఆరె స్వాతి ఉన్నత విద్యకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆర్థికసాయం అందజేశారు. యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్ యూకేలో ఎంఏ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం నుంచి అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నుంచి రూ.20లక్షలతోపాటు ప్రయాణఛార్జీలకు రూ.50వేలు గురువారం క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు, సర్పంచ్ పున్నం, నాయకులు విద్యాసాగర్, సంపత్ పాల్గొన్నారు.

రాహుల్ పాదయాత్రకు దేశవ్యాప్త స్పందన



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర గురువారం ఏడాది పూర్తి చేసుకోగా, దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించిందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జోడోయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సీసీసీ వరకు పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ఓవర్‌బ్రిడ్జి మీదుగా తోళ్లవాగు వరకు చేరుకుని, ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'



సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య స్వంత ఊరు పాతమంచిర్యాలలో సమస్యలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొద్దున మల్లేశ్, గురువయ్య, కాశెట్టి నాగేశ్వర్‌రావు, ముదాం మల్లేశ్, గాదాసు మల్లేశ్, అమిరిశెట్టి రాజు, రెడ్డిమల్ల అశోక్, బింగి సత్యనారాయణ, అవిడపు దీపక్ సాయి, చక్రి పాల్గొన్నారు.


బీసీలకు 60 సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

పాతమంచిర్యాల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 60 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం నాయకులతో బీసీల సింహగర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 60 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో ఈ నెల 10న బీసీల సింహగర్జన పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు నరేందర్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్కడ అభ్యర్థులే ఎమ్మెల్యేలు!



వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను కాదని కొత్తవారికి అవకాశం కల్పించారు. దీంతో ఆగస్టు 21న నుంచి ఆ నియోజకవర్గాల్లో పరిస్థితి మారిపోయింది. పార్టీ కేడర్, జనంతోపాటు కొందరు అధికారులు సైతం అభ్యర్థులకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

- మూడు చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కష్టాలు
- కొత్త అభ్యర్థులకే పార్టీ కేడర్ జై..
- ప్రభుత్వ పథకాల ఎంపికలోనూ ఇరకాటం
- పదవి ఉండగానే 'పనులు' పూర్తి చేసేలా ప్లాన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీకి మూడు స్థానాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. టికెట్ దక్కిన నాయకులు, పోటీ చేసే అవకాశం కోల్పోయిన వారి మధ్య దూరం ఏర్పడుతోంది. బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల ప్రాబల్యం క్రమంగా తగ్గిపోతోంది. ఇంకా వచ్చే జనవరి వరకు శాసనసభ్యుల పదవీ కాలం ఉన్నప్పటికీ అంతకుముందే పరిస్థితి మారిపోతోంది. ఇక ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక, కేడర్ బాగోగులు, పార్టీ కార్యక్రమాలన్నీ అభ్యర్థుల కనుసన్నల్లోనే సాగుతున్నాయి.

కాంగ్రెస్‌లో చేరుతారని..

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేయడం, ఆమె భర్త రిటైర్డ్ రవాణాశాఖ అధికారి కాంగ్రెస్‌లో చేరి ఆసిఫాబాద్‌లో పట్టు పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె కూడా కాంగ్రెస్‌లో చేరుతారని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు క్రమంగా దూరం అవుతున్నారు. ఇక్కడి అభ్యర్థి జాన్సన్ నాయక్ చెంతకు చేరుతున్నారు. కొందరు ఇంకా కొన్నాళ్లు పదవీ కాలం ఉండడంతో అప్పటి వరకు వేచి చూద్దామనే ఆలోచనతోనూ ఉన్నారు. పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయి ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పార్టీ మారితే ఎంతమంది ఆమె వెంట నడుస్తున్నారనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు అన్నీ కొత్త అభ్యర్థి పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి.

సఖ్యత బయటకేనా?

బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు రాథోడ్‌బాపురావు, ఆత్రం సక్కుకు ఈసారి టికెట్లు రాక, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్‌కు అవకాశం లభించింది. ఈ రెండు చోట్ల అభ్యర్థులు, ఎమ్మెల్యేలు కలిసి పని చేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. వీరి మధ్య సఖ్యత కుదిరేలా చర్యలు చేపట్టింది. ఈ రెండు చోట్ల ఎమ్మెల్యేల ప్రాబల్యం తగ్గుతోంది. కుమురంభీం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అధికార, పార్టీ కార్యక్రమాల్లో అన్నీ తానై ముందుకు సాగుతున్నారు. అటు అధికారులు, ఇటు కార్యకర్తలు ఏ పనికైనా ఆమెనే ముందు కలుస్తున్నారు. ఇక బోథ్‌లోనూ బాపురావు, అనిల్ జాదవ్ మధ్య సఖ్యత ఉందని బయటకు చెబుతున్నప్పటికీ లోపల పరిస్థితి వేరేలా ఉంది. తనకు పోటీ చేసే అవకాశం లేకుండా పోయిందనే భావనలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనిల్ విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నారు.

లబ్ధిదారుల ఎంపికలో ఇరకాటం

ఎన్నికల ముందు ప్రభుత్వం అందిస్తున్న బీసీ, మైనార్టీ బంధు, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, దళితబంధు రెండో విడతలో ఒక్కో నియోజకవర్గంలో 1100యూనిట్లు ఎంపిక చేయాల్సి ఉంది. గతంలో పార్టీ కేడర్‌కు మాటిచ్చిన ఎమ్మెల్యేలకు తాజా పరిణామాలతో ఆయా పథకాల్లో తాము కోరుకున్న వారిని ఎంపిక చేయాలంటే ఇబ్బందికరంగా మారింది. తన అనుకునేవారికి ఇస్తే కొత్త అభ్యర్థులతో సమస్య ఉంది. అలా కాక కొత్త అభ్యర్థి సూచించిన వారికి ఇస్తే తన కేడర్‌కు సమస్య ఉంది. ఈ క్రమంలో కొన్ని చోట్ల ఇద్దరు కలిసి లబ్ధిదారుల ఎంపికల్లో సగం సగం చొప్పున యూనిట్లను పంచుకున్నట్లు సమాచారం. మరోవైపు కొన్ని చోట్ల సంక్షేమ పథకాలు అందేలా చేస్తామని కొందరు డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వాళ్లు బయటకు వచ్చి ఫిర్యాదు చేస్తే పదవీలో ఉన్నవారు రాజకీయంగా ఇబ్బంది పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే పదవీ కాలం వరకు వేచి చూసి ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక, నిధులు ఖర్చయ్యే వరకు గప్‌చుప్‌గా ఉండాలని అనుకున్నట్లు సమాచారం.

'కమలం' వైపు 'నల్లాల' చూపు..!

- బుజ్జగించిన విప్ సుమన్
- ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న ఓదెలు

మందమర్రిరూరల్: ప్రభుత్వ మాజీ విప్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు బీజేపీ వైపు చూస్తున్నట్లు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగింది. ఈ విషయాన్ని వెంటనే గ్రహించిన ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ బుధవారం రాత్రి హుటాహుటిన ఓదెలు ఇంటికి వెళ్లారు. అక్కడే డిన్నర్ చేస్తూ రాజకీయ భవిష్యత్‌కు సంబంధించిన విషయాలపై మాట్లాడుకున్నట్లు సమాచారం. గతంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఓదెలు దంపతులు విప్ సుమన్‌తో కలిసి పని చేయలేమని ప్రియాంకాగాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొన్ని నెలల వ్యవధిలోనే.. బీఆర్‌ఎస్ అధిష్టానం ఓదెలు దంపతులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ఓదెలుకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీనివ్వడంతో తిరిగి పార్టీలోకి వచ్చారు. ఆ హామీలు ఇప్పటివరకు నెరవేర్చకపోవడంతో నిరుత్సాహంతో ఉన్నట్లు తెలుసుకున్న సుమన్ మందమర్రిలోని ఓదెలు ఇంటికి వెళ్లి బుజ్జగించినట్లు తెలిసింది. తనకు ఎమ్మెల్సీ పదవి, భాగ్యలక్ష్మికి తిరిగి జెడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇప్పించాలని సుమన్ ముందుంచారని సమాచారం. ఈ విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఇప్పించే ప్రయత్నం చేస్తానని ఆయన హామీనిచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఏదేమైనా తనకు రాజకీయంగా భవిష్యత్ లేకుండా పోతోందనే బాధతో ఓదెలు ఉన్నట్లు అనుచరుల ద్వారా తెలిసింది. ఈ విషయమై ఓదెలును సంప్రదించగా.. తనను బీఎస్పీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫోన్‌లో సంప్రదిస్తున్నారని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కొందరు కోరుతున్నారని అన్నారు. ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని, ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మీడియా ముందుకు వచ్చి తెలియజేస్తానని తెలిపారు.

గృహ'లక్ష్మి' వరించేదెవరినో..?

- జిల్లాలో 51,764 దరఖాస్తులు
- సర్వే అనంతరం 40,501 అర్హుల గుర్తింపు
- ఆన్‌లైన్‌లో వివరాల నమోదు
- స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే..?
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు



మంచిర్యాలలో దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఇంటి స్థలం ఉండి, ఇల్లు లేని వారికోసం ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం గృహలక్ష్మి పథకం ప్రారంభించింది. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసిన అధికారులు అర్హులను గుర్తించారు. ఆ వివరాలను మున్సిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

51,764 దరఖాస్తులు..

గృహలక్ష్మి పథకం కోసం ఆగస్టు 7 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 51,764 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే నెల 20 వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సరైన పత్రాలు లేనివారు, అప్పటికే స్లాబ్‌తో కూడిన ఇల్లు ఉన్నవారు, ఒకే పేరుతో రెండు దరఖాస్తులను చేసుకున్నవారు, స్థానికంగా నివాసం ఉంటూ, ఇతర మండలాలు, జిల్లాల్లో స్థలం ఉండి దరఖాస్తు చేసుకున్నవారు ఇలా రకరకాల కారణాలతో అనర్హులైన వారిని తొలగించారు. జిల్లావ్యాప్తంగా 11,263 దరఖాస్తులు తొలగించారు. 40,501 మంది అర్హులుగా తేల్చారు. అర్హుల వివరాల ఆన్‌లైన్ ప్రక్రియ కూడా చివరి దశలో ఉంది. అర్హులు భారీగా ఉండడంతో ఎవరిని ఎంపిక చేయాలని తర్జనభర్జన పడుతున్నారు.

మొదటి విడతలో వచ్చేలా

జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు మూడు నియోజకవర్గాలు ఉండగా, నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలోని జన్నారం మండలం మంచిర్యాల జిల్లాలోనే ఉంది. దీంతో మొదటి విడతలో నియోజకవర్గానికి 3 వేల చొప్పున మొత్తంగా 9 వేలు, జన్నారం మండలం 400 కలిపి 9,400 మంది లబ్ధిదారులకు మొదటి విడతలో ఈ స్కీంను వర్తింపజేయనున్నారు. మొదటి విడతలో తమ పేర్లు ఉండాలని పలువురు ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు.

అచితూచి ఎంపిక..

రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి పలు పథకాలను ప్రవేశపెట్టడం, అర్హుల ఎంపికను ఎమ్మెల్యేలకు అప్పగించడంతో వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులను అచితూచి ఎంపిక చేస్తున్నారు. గతేడాది దళితబంధు పథకం లబ్ధిదారులను నియోజకవర్గానికి 100 మంది చొప్పున ఎంపిక చేయగా, ఎమ్మెల్యేలు వారికి అనుకూలంగా ఉండి, పార్టీకి విధేయంగా ఉండే వారికే దళితబంధును అందించారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా బీసీబంధు, మైనారిటీబంధు, గృహలక్ష్మి స్కీం మూడు ఒకేసారి తీసుకొచ్చారు. ఇప్పటికే ప్రతీనెల 300 మంది చొప్పున బీసీబంధు పథకంలో భాగంగా రూ.లక్ష సాయం అందిస్తున్నారు. బీసీబంధు, మైనారిటీబంధు పథకాల్లో ఎంపిక చేసిన వారిని కాకుండా, తమకు అనుకూలంగా ఉండే ఇతరులను గృహలక్ష్మికి ఎంపిక చేసే పనిలో ఎమ్మెల్యేలు నిమగ్నమయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు తమ వారికే ఆయా పథకాలను ఇప్పించుకునేందుకు ఎమ్మెల్యేలకు సిఫారసు చేస్తుండగా, ఎమ్మెల్యేలు మాత్రం అచితూచి ఎంపిక చేస్తున్నారు. నియోజకవర్గానికి 3 వేల మందిని ఎంపిక చేయడం మాత్రం ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

మండలాల వారీగా దరఖాస్తులు, సర్వే అనంతరం అర్హులు

మండలం	వచ్చిన దరఖాస్తులు	గుర్తించిన అర్హులు
బెల్లంపల్లి	2,463	1,999
భీమిని	2,305	1,735
కన్నెపల్లి	2,808	2,381
కాసిపేట్	2,594	2,152
నెన్నెల	2,299	1,970
తాండూరు	3,335	2,589
వేమనపల్లి	2,269	2,224
చెన్నూరు	3,795	2,865
కోటపల్లి	4,275	4,055
భీమారం	2,066	1,547
జైపూర్	2,231	1,729
మందమర్రి	996	833
హాజీపూర్	1,881	1,575
లక్సెట్టిపేట్	1,787	1,505
దండేపల్లి	2,916	2,430

మున్సిపాలిటీల వారీగా

మున్సిపాలిటీ	వచ్చిన దరఖాస్తులు	గుర్తించిన అర్హులు
మంచిర్యాల	1,611	1,388
లక్సెట్టిపేట	1,787	1,505
నస్పూర్	1,129	405
క్యాతన్‌పల్లి	576	200
మందమర్రి	1,101	890
చెన్నూరు	1,533	1,139
బెల్లంపల్లి	2,950	1,111
మొత్తం	51,764	40,501

ఔర్ ఏక్ దక్కా.. హ్యాట్రిక్ పక్కా

- సమన్వయంతో పని చేయాలి
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

నస్పూర్: తెలంగాణ ప్రజల ఔర్ ఏక్ దక్కాతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ పక్కా అని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. గురువారం ఆయన నస్పూర్‌లోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడానికి అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. రాబోయే రెండు నెలల వ్యవధిలో సింగరేణి ఉద్యోగులకు రూ.2800 కోట్లు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. వార్డు, మండలం, మున్సిపాలిటీల వారీగా ఎన్నికల కో ఆర్డినేటర్లు, యూత్, మహిళా కమిటీలు, సోషల్ మీడియా కమిటీలు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లో మంత్రి కేటీఆర్‌ను నియోజకవర్గానికి ఆహ్వానించి అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాడే తత్వం కాంగ్రెస్ డీఎన్ఏలోనే లేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పోరాటం, త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. అంతకుముందు దేశపతి శ్రీనివాస్ పాడిన ఉద్యమ పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎంశ్రీకి 44 పాఠశాలలు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రతీ మండలం నుంచి రెండేసి పాఠశాలలను ఎంపిక చేసి ఐదేళ్ల వ్యవధిలో రూ.2కోట్లు మేర నిధులు అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. మొదటి దఫాలో 19పాఠశాలలు జాతీయ స్థాయిలో ఎంపికయ్యాయి. రెండో దఫా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా జిల్లా నుంచి 44 పాఠశాలలు అర్హత సాధించాయి. కలెక్టర్ ఆమోదం తర్వాత బుధవారం రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. అక్కడ పరిశీలన తర్వాత జాతీయ స్థాయికి పంపిస్తారు.

కార్యక్రమాలు ఇలా..

విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక వనరుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి. పాఠశాలల్లో సౌర విద్యుత్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల ఏర్పాటు, తోటల పెంపకం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత చర్యలు, బొమ్మలతో బోధన, విద్యార్థుల సామర్థ్యాల మదింపు వంటివన్నీ చేపడుతారు. ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తారు. విద్యార్థుల్లో భాషా పరమైన అవరోధాలు అధిగమించడానికి అవసరమైన సాంకేతిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

పాఠశాలలు ఇవీ..

జెడ్పీహెచ్‌ఎస్(బాలికల) బెల్లంపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ బజార్‌ఏరియా, కేజీబీవీ బెల్లంపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల(టీఎం, ఈఎం) చెన్నూర్, వెల్గనూర్, సబ్బపల్లి, కలమడుగు, ధర్మారావుపేట్ జెడ్పీహెచ్‌ఎస్‌లు, కాసిపేట, లింగపూర్, పద్మన్‌పల్లి, మిట్టపల్లి, వేలాల, ఇందన్‌పల్లి, తిమ్మాపూర్, నార్వాయిపేట్ ఎంపీయూపీఎస్‌లు, చింతగూడ, గీతానగర్, జన్కపూర్, కుందారం, దేవాపూర్, దేవులవాడ, అల్గాన్, లక్ష్మీపూర్, బస్టాండ్ లక్సెట్టిపేట, బోయవాడ లక్సెట్టిపేట, బాలుర లక్సెట్టిపేట, మైలారం, గొల్లపల్లి, నెన్నెల, దొరగారిపల్లి, గూడెం, మామిడిపల్లి, పెద్దపేట్, రెబ్బనపల్లి ఎంపీపీఎస్‌లు, టీఎస్ఎంఎస్ కోటపల్లి, జెడ్పీహెచ్‌ఎస్(బాలికల) లక్సెట్టిపేట, జీపీఎస్ ఏసీసీ, జీపీఎస్ హమాలీవాడ, జీ యూపీఎస్(యూఎం) మోమిన్‌పూర, యూపీఎస్, ఎంపీయూపీఎస్ 2జోన్ మందమర్రి, ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్ఈఐఎస్ బాలుర నస్పూర్, ఎంపీపీఎస్ సంఘమల్లయ్యపల్లె ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి నివేదించారు.

సరిహద్దుపై నిఘా ఏర్పాటు చేయాలి

- రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి
- పోలీసు ఉన్నతాధికారుల సమావేశం



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా ముందస్తుగా సరిహద్దు పోలీసు అధికారులు ఇప్పటి నుంచే సరికొత్త విధానంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. గురువారం సరిహద్దు ప్రాంతాలకు చెందిన ఆరు జిల్లాల ఎస్పీలతో రామగుండం పోలీసు కమిషనరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మద్యం అమ్మకాలు, ఆయుధాలు, ఇతర అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి సారించాలని అన్నారు. అంతర్‌జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు ప్రాంతాల గుర్తింపు, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా, ఉమ్మడి కూంబింగ్ ఆపరేషన్ ఏరియా డామినేషన్ తదితర 13రకాల అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో పెద్దపెల్లి జిల్లా డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, నిర్మల్ జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్, కుమురంభీమ్ జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్, జగిత్యాల ఎస్పీ భాస్కర్, భూపాలపెల్లి జిల్లా ఎస్పీ కర్ణాకర్, కరీంనగర్ రూరల్ ఏసీపీ టీ.కర్ణాకర్‌రావు, సరిహద్దు ప్రాంతాల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన



డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ఈ నెల 4, 5న ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. 1,832 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. హార్డ్‌కాపీని డీఈవో కార్యాలయంలో సమర్పించగా పరిశీలన ప్రక్రియ గురువారం ముగిసింది.

బోనాలతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



బోనాలు చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలో భాగంగా గురువారం మంచిర్యాలలో తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బోనాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. రిలే నిరాహార దీక్షల శిబిరం నుంచి ఐబీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం మీదుగా ఆంజనేయుని విగ్రహం వద్దకు చేరుకుని బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను ఏకరువు పెట్టగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సముఖత వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పర్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్ సంఘీభావం ప్రకటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎర్రవెల్లి రఘునాథ్ సందర్శించి సమస్యల సాధనకు తమ మద్దతు ప్రకటించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదుగురిపై కేసు నమోదు

జన్నారం: అనుమతి లేకుండా రోడ్డుపై రాస్తారోకో చేసి ప్రజలు, వాహనదారులకు అసౌకర్యం కల్పించిన ఐదుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన గొర్రెపిల్లకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం గాంధీనగర్ సమీపంలోని ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా రాస్తారోకో చేసిన కొండపల్లి మహేష్, గట్టు మహేష్, సల్ల మహేష్, తిరుపతి, వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరికి పాము కాటు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని లింగూడకు చెందిన నాందేవ్ గురువారం ఉదయం పత్తి పంటకు మందు పిచికారీ చేసేందుకు భార్యతో కలిసి వెళ్లాడు. మందు పిచికారీ చేస్తుండగా పాము కాటేయడంతో ఆటోలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన సాయి బుధవారం రాత్రి మూత్ర విసర్జనకు బయటకు రాగా పాము కాటు వేసింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

బావిలో దూకి ఆత్మహత్య



మధు(ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామానికి చెందిన దందెర మధు (55) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మధు కొంతకాలంగా మతిస్థిమితం లేక ఇంటివద్దే ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. గ్రామసమీపంలోని పాడుబడ్డ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు.

డెంగీతో ఒకరు మృతి



నవీన్ (ఫైల్)

కౌటాల(సిర్పూర్): సిర్పూర్(టి) మండలంలోని లోనవెల్లి గ్రామానికి చెందిన జునారి నవీన్(30) బుధవారం రాత్రి డెంగీతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ మూడేళ్లుగా కౌటాల మండలంలోని ముత్తంపేటలో నివాసం ఉంటున్నాడు. 15 రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా చికిత్స అందించినప్పటికీ తగ్గకపోవడంతో మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య మధునక్క, కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

బెజ్జూర్: ఈ నెల 2న పిడుగుపాటుకు గురైన మండలంలోని పోతేపెల్లి గ్రామానికి చెందిన తొడసం బూదక్క (60) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పంటపొలంలో పిడుగుపాటుకు గురైన వృద్ధురాలిని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మోసగించిన రైల్వే ఉద్యోగిపై కేసు

బెల్లంపల్లి: రైల్వేలో ఉద్యోగం పెట్టిస్తానని మోసగించిన ఓ రైల్వే ఉద్యోగిపై గురువారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బెల్లంపల్లి బస్తీకి చెందిన రిటైర్డు పోలీసు హెడ్‌కానిస్టేబుల్ చన్నారం సుదర్శన్ రెండో కుమారుడు వెంకటేశ్‌కు కొంతకాలం క్రితం రైల్వేలో ఉద్యోగం పెట్టిస్తానని నమ్మించి రంగారెడ్డి జిల్లా దిల్‌షుక్‌నగర్‌లోని కొత్తపేటకు చెందిన బత్తిని రామనాథం రూ.13 లక్షలు తీసుకున్నాడు. నిందితుడు కాజీపేటలోని రైల్వే శాఖలో టీఎం ఎస్ఎస్‌సీలో గ్రేడ్-1 ఫిట్టర్‌గా, ఓ రైల్వే కార్మికసంఘంలో నాయకుడిగా పనిచేస్తున్నట్లు బాధితులు తెలిపారు. ఇప్పటి వరకూ రైల్వేలో ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామనాథంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి



రాజేశ్(ఫైల్)

రెబ్బెన: ఈ నెల 4న పాము కాటుకు గురైన గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడకు చెందిన దాసరి రాజేశ్ (41) గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. బోడ కాకర కాయల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లిన రాజేశ్ కాయలు కోస్తుండగా కాలుపై ఏదో విష పురుగు కాటువేసింది. కాలు వాపెక్కడంతో కుటుంబ సభ్యులు రెబ్బెన పీహెచ్‌సీ తరలించారు. పరీక్షించిన పీహెచ్‌సీ సిబ్బంది పాము కాటు వేసినట్లు నిర్ధారించి బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. మెరుగైన చికిత్సకోసం మంచిర్యాలకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైల్వేలో స్మార్ట్ బుకింగ్

- మొబైల్ యాప్ ద్వారా జనరల్ టికెట్
- రైల్వే ప్రయాణికులకు మరింత చేరువ
- యూటీఎస్ యాప్‌తో సాధారణ ప్రయాణికులకు మేలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



రైల్వేస్టేషన్‌లో గోడలపై అధికారులు అతికించిన క్యూఆర్ కోడ్ పోస్టర్



యూటీఎస్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

మంచిర్యాలక్రైం: ప్రయాణం అంటేనే లగేజీ, పిల్లలతో హడావిడి ఉంటుంది. తీరా స్టేషన్‌కు వెళ్లాక టికెట్ తీసుకునేందుకు కౌంటర్ వద్దకు వెళ్తే భారీ క్యూ ఉంటోంది. దీంతో రైలు వెళ్లి పోతుందేమోననే ఆతృత ప్రయాణికుల్లో నెలకొంటుంది. ఇకపై అలాంటి టెన్షన్ లేకుండా దక్షిణ మధ్యరైల్వే శాఖ సాధారణ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే ఆన్‌లైన్ పద్ధతిలో అనేక రకాల సేవలు అందిస్తోంది. ఈ సారి సరికొత్త యూటీఎస్ (అన్ రిజర్వ్‌డ్ టికెట్ సిస్టం) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ వచ్చి చాలా రోజులైనప్పటికీ దీనిపై అవగాహన లేకపోవడంతో జనరల్ టికెట్‌పై ప్రయాణించే వారు రైలు సమయానికి వచ్చి క్యూలో నిలబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అత్యవసర పరిస్థితుల్లో టికెట్ లేకుండానే ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికోసమే రైల్వే శాఖ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిపై రైల్వే అధికారులు ప్రయాణికులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రయాణికులు జనరల్ టికెట్లను సులువుగా పొందే అవకాశం ఉంది. యాప్ సాయంతో జనరల్ టికెట్లు, నెలవారీ సీజన్ టికెట్లు, ప్లాట్‌ఫాం టికెట్లు సైతం తీసుకునే అవకాశం ఉంది. ఇందుకు ప్రయాణికులు యూటీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

టికెట్ పొందే విధానం..

ఆండ్రాయిడ్, స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లేస్టోర్, ఐఫోన్ వినియోగదారులు యాప్‌స్టోర్, విండోస్ ఫోన్ వినియోగదారులు యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. లేదా (www. utsonmobile. indianrail. gov. in) వెబ్‌సైట్‌లోకి వెళ్లి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందుకు కావాల్సిందల్లా జీపీఆర్ఎస్ యాక్టివేషన్‌తో కూడిన స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉండాలి. ఇందులో సెల్‌నంబర్, పేరు, పుట్టినతేదీ నమోదు చేయాలి. ఆ తర్వాత పాస్‌వర్డ్ వస్తుంది. దానిని ఎంటర్ చేసి యాప్‌లో లాగిన్ కావాలి. రైలు ఎక్కాల్సిన స్టేషన్‌తో పాటు దిగాల్సిన స్టేషన్ పేర్లు నమోదు చేయాలి. నెట్ బ్యాంకింగ్ ద్వారా క్యాష్ చెల్లించి టికెట్ పొందాలి. అనివార్య కారణాలతో ప్రయాణం రద్దయితే కొంత గడువులోగా టికెట్ రద్దు చేసుకునే అవకాశం ఉంది.

క్యూ వద్దు.. క్యూఆర్ కోడ్ ముద్దు...

'క్యూ వద్దు.. క్యూఆర్ కోడ్ ముద్దు' అంటూ రైల్వే అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రైల్వే స్టేషన్లలో గోడలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను అంటిస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులను ఆన్‌లైన్ బుకింగ్ వైపు మళ్లించడంతో పాటు బుకింగ్ కౌంటర్లలో సిబ్బందిని తగ్గించే యోచనలో రైల్వే శాఖ ఉన్నట్లు సమాచారం.

నిబంధనలు ఇవే..

- ప్రయాణించే రోజు మాత్రమే టికెట్ బుక్ చేసుకోవాలి.
- బుక్ చేసుకున్న గంటలోపే రైలు ఎక్కాలి.
- రైల్వే స్టేషన్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడే యూటీఎస్ యాప్ ద్వారా జనరల్ టికెట్ బుక్ అవుతుంది.
- రైలులో ప్రయాణిస్తున్నప్పుడు టికెట్ బుక్ కాదు.
- స్మార్ట్ ఫోన్‌లో జీపీఆర్ఎస్ యాక్టివేషన్‌లో ఉండాలి.

శ్రమదోపిడీకి గురిచేస్తున్న 'పవర్‌మేక్'

- బీఎంఎస్ అడహక్ కమిటీ కన్వీనర్ పేరం రమేశ్



మాట్లాడుతున్న పేరం రమేశ్

జైపూర్(చెన్నూర్): ఎస్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న పవర్‌మేక్ కంపనీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తోందని ఎస్టీపీపీ బీఎంఎస్ అనుబంధ సంఘం అడహక్ కమిటీ కన్వీనర్ పేరం రమేశ్ ఆరోపించారు. గురువారం పవర్ ప్లాంటు వద్ద ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన జీతాలు, అలవెన్సుల్లో కోతలు విధించడం సరికాదన్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం కార్మికులు రాత్రింబవళ్లు పని చేస్తున్నప్పటికీ వేతనాలు, అలవెన్సులు సరిగ్గా చెల్లించకుండా కంపెనీ కోట్ల రూపాయలు దోచుకుంటోందన్నారు. అంతేకాకుండా కార్మికుల రక్షణ పూర్తిగా విస్మరించి నిబంధనలు అతిక్రమిస్తూ ఇష్టారీతిన పనులు చేయిస్తున్నారన్నారు. సబ్ కాంట్రాక్టు పేరుతో రెండేళ్లకోసారి కంపెనీ పేరు మారుస్తూ కార్మికుల గ్రాట్యుటీ, ఇతర అలవెన్సులను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్మికులకు కనీసం పే స్లిప్స్ కూడా ఇవ్వడం లేదన్నారు.

కార్మికులకు బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నస్పూర్: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల శాలివాహన బయోమాస్ పవర్ ప్లాంట్ కార్మికులకు రావాల్సిన బెన్‌ఫిట్స్ వెంటనే చెల్లించాలని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా పవర్ ప్లాంట్‌ను మూసివేయడంతో ప్రత్యక్షంగా 100 మంది, పరోక్షంగా మరో 100 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. పవర్ ప్లాంట్ మూసి వేసి పది నెలలు కావస్తున్నా యాజమాన్యం ఇప్పటికీ బెన్‌ఫిట్స్ చెల్లించలేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులకు జైపూర్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు మద్దూరి రాజు యాదవ్, కంటాల శంకర్, సగుర్తి ఆనందరావు, రావుల తిరుపతి, అర్కెల్ల శ్రీనివాస్, భాస్కర్, కృష్ణ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

11న అప్రెంటిస్‌షిప్ మేళా

మందమర్రిరూరల్: ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 11న మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www. apprentceshipindia. govt. in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మేళాకు వచ్చే సమయంలో రెజ్యూమ్, అప్రెంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్ కాపీ, రెండు ఫొటోలు, విద్యార్హత ధృవపత్రాలు వెంట తీసుకు రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్మికులకు ఏరియర్స్ ఒకే దఫాలో చెల్లించాలి



దీక్షలు ప్రారంభిస్తున్న కలవేణ శంకర్

నస్పూర్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ ఒకే దఫాలో చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఏరియర్స్ చెల్లింపులో కాలయాపన చేస్తూ కార్మికులను అసంతృప్తికి గురిచేస్తోందన్నారు. లాభాల వాటా 35 శాతం సైతం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయక కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు రాజేశ్వర్‌రావు, చంద్రమోహన్, సంఘం సదానందం, సారయ్య, రాజయ్య, రవీందర్, మురళీచౌదరి, నర్సింగరావు, చిలుక రాంచందర్, అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

నస్పూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే 5 గని, కృష్ణాకాలనీ సివిక్, ఎస్సార్పీ ఓసీపీ గనులపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో కార్మికవాడలకు ఓట్లకోసం వచ్చిన ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, నాయకులు సంపత్, నరేశ్, అంకూస్, రమేశ్, ఆరిఫ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీని సందర్శించిన డీడీఎంఎస్



అధికారులతో మాట్లాడుతున్న ఆర్ముగం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీని గురువారం డీడీఎంఎస్ (మెకానికల్ ఇన్‌స్పెక్టర్)ఆర్ముగం సందర్శించారు. సీహెచ్‌పీలో రక్షణ విధానం, మెయింటనెన్స్ సిస్టం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌వోపీ, లోటో సిస్టమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. రక్షణ నియమాలను పాటిస్తూ అప్రమత్తతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం నాగరాజు, డీజీఎం బాలాజీ భగవతి, ఎస్‌వో జయంత్, డీవైఎస్ఈ చంద్రమౌళి పాల్గొన్నారు.

12న ట్రైపార్టైట్ సేఫ్టీ మీటింగ్

మందమర్రిరూరల్(చెన్నూర్): ఈ నెల 12న ఇల్లందు క్లబ్ ఆవరణలో ఏరియా స్థాయి ట్రైపార్టైట్ సేఫ్టీ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. గురువారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఎస్‌వో రవీందర్, ఐఈడీ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

నా కొడుకు భవిష్యత్ నాశనం చేయొద్దు

- మైనార్టీ పాఠశాల ఎదుట విద్యార్థి తల్లిదండ్రుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

చెన్నూర్: పదో తరగతి చదువుతున్న తమ కుమారుడి భవిష్యత్ నాశనం చేయవద్దని కోరుతూ ఓ విద్యార్థి తల్లిదండ్రులు గురువారం స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రేష్మసుల్తానా, సలావొద్దీన్ దంపతుల కుమారుడు రహనొద్దీన్ స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయులు చదువు సక్రమంగా చెప్పడంలేదని రహనొద్దీన్, ఇంతియాజ్, అమీర్ అనే విద్యార్థులు గతనెలలో ఆర్సీవో రాజేశ్వరి, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముగ్గురు విద్యార్థులపై కక్షగట్టిన ఉపాధ్యాయులు కాగజ్‌నగర్ మైనార్టీ పాఠశాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. రహనొద్దీన్ కాగజ్‌నగర్ వెళ్లకపోవడంతో టీసీ ఇచ్చి పంపించారు. దీంతో అతని తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. చదువు మధ్యలో టీసీ ఇచ్చి పంపిస్తే అతని జీవితం నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమ కుమారుడిని చెన్నూర్ మైనార్టీ పాఠశాలలోనే చదువుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

రెప్పపాటులో మృత్యు ఒడికి..

- లారీ అదుపుతప్పి రోడ్డుపక్కన కూర్చున్న వారిపై బోల్తా..
- వాహనం కింద నలిగి తండ్రి, కొడుకు దుర్మరణం
- మూడు నెలల క్రితం అనారోగ్యంతో కూతురు..
- కళ్ల ముందే భర్త, కుమారుడి మృతితో గుండెలు పగిలేలా రోదించిన భార్య
- మృతులు సంగారెడ్డి జిల్లా అనంతారం వాసులు



దాతల నుంచి డబ్బు పోగు చేస్తున్న స్థానికులు



భర్త, కుమారుడి మృతదేహాల వద్ద రోదిస్తున్న మంజుల



సాయికుమార్ (ఫైల్)

జన్నారం:ప్రాణం నీటి బుడగలాంటిది అంటారు.. వాన రాక.. ప్రాణం పోక తెలియదు.. అనే సామెత ఇక్కడ అక్షర సత్యమైంది. అప్పటి వరకూ ఆటలాడుతూ ఉన్న కొడుకు, తనతో మాట్లాడుకుంటూ వచ్చిన భర్త.. రెప్పపాటులో మృత్యు ఒడికి చేరారు. లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరినీ కబళించింది. కళ్ల ముందే లారీకింద నలిగి విగత జీవులుగా మారిన కొడుకు, భర్తను చూసి ఆతల్లి గుండె పగిలింది. నిర్జీవంగా పడి ఉన్న కొడుకును ముద్దాడుతూ 'అయ్యో కొడుకా.. లేరా.. ఊరికి పోదాం బిడ్డ... నీకు అప్పుడే నూరేళ్లు నిండాయా.. ఇప్పటి వరకూ నాతోనే ఆడుకుంటివి గదరా..' అంటూ రోదించిన తీరు అక్కడున్నవారిని కన్నీరు పెట్టించింది. ముడు నెలల క్రితం కూతురును పోగొట్టుకున్న ఆ తల్లికి కొడుకు, భర్త కూడా దూరమయ్యారు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగులో గురువారం జరిగింది.

స్వగ్రామానికి వెళ్దామని..

సంగారెడ్డి జిల్లా అంతారం మండలం అనంతారం గ్రామానికి చెందిన జోగి సాయికుమార్ (36) రెండేళ్లుగా జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన కుతుబొద్దీన్ డెయిరీఫాంలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య మంజుల, కుమారుడు లక్ష్మణ్ (7), కూతురు(ఒకటిన్నర సంవత్సరాలు)ఉన్నారు. మూడు నెలల క్రితం వీరి కూతురు అనారోగ్యంతో మృతి చెందింది. ఆ విషాదం నుంచి ఇంకా కోలుకోలేదు. కూతరు జ్ఞాపకాలు మర్చిపోయేందుకు తన సొంత గ్రామానికి వెళ్దామని గురువారం భార్య, కొడుకుతో కలిసి రేండ్లగూడ నుంచి ఆటోలో కలమడుగుకు వచ్చాడు. అక్కడి నుంచి జగిత్యాల వరకు బస్సులో వెళ్లేందుకు బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఉన్న బెంచీపై కూర్చున్నారు.

దూసుకొచ్చిన లారీ..

ఈ సమయంలో నాగ్‌పూర్ నుంచి కోయంబత్తూరుకు దారంలోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి బస్టాండ్ సమీపంలో ఉన్న స్తంభాన్ని ఢీకొట్టి బెంచీపై కూర్చున్న సాయికుమార్, లక్ష్మణ్‌పై బోల్తా పడింది. ఇద్దరూ లారీ కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు వెంటనే మృతదేహాలను బయటకు తీశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సతీశ్, రెండో ఎస్సై సర్కార్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవర్..

లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం, అతి వేగంగా వాహనం నడుపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఉట్నూర్ మండలం బీర్సాయిపేటకు చెందిన లారీ డ్రైవర్ రమేశ్, క్లీనర్ అశోక్‌ను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. లారీ డ్రైవర్ మద్యం సేవించి అతివేగంగా అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్, క్లీనర్, మరో వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

మూడు నెలల్లో ముగ్గురు మృతి..

మూడు నెలల వ్యవధిలో సాయికుమార్ కుటుంబంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మృత్యువు ఆ కుటుంబాన్ని వెంటాడుతుందని స్థానికులు చర్చించుకున్నారు. మూడు నెలల క్రితం కూతురును అనారోగ్యంతో కబళించగా, తాజాగా లారీ రూపంలో భర్త, కొడుకును బలి తీసుకుంది. దీంతో సాయికుమార్ భార్య మంజుల గుండెలు పగిలేలా రోదిస్తోంది.

జోలెపట్టి మానవత్వం చాటిన గ్రామస్తులు

బతుకుదెరువు కోసం వచ్చి మృతి చెందిన వారిని చూసి చలించిన కలమడుగు గ్రామస్తులు మృతదేహాలను స్వగ్రామం తరలించేందుకు ఆర్థికసాయనికి ముందుకు వచ్చారు. అంత్యక్రియలు, ఇతర ఖర్చుల నిమిత్తం జోలే పట్టి యాచించారు. ఇలా పోగయిన రూ.24 వేల నగదును మంజులకు అందజేశారు.

క్షణాల్లో జరిగింది..



నేను బస్టాండ్‌లోని నా దుకాణంలో కటింగ్ చేస్తున్నా. ఒక్కసారిగా టైర్లు రోడ్డుపై రాక్కుంటూ వచ్చిన శబ్దం వినిపించడంతో బయటకు వచ్చి చూశా. ఒకేవైపునకు వంగిన లారీ కొంతదూరం వెళ్లి బెంచీపై కూర్చున్న ఇద్దరిపై బోల్తా పడింది. అప్పటికే కేకలు వేసినా వారు గమనించలేదు. అంతా క్షణాల్లో జరిగిపోయింది.

– రవి, ప్రత్యక్ష సాక్షి, కలమడుగు

పాటలు పాడుతూ వచ్చాడు



రేండ్లగూడ నుంచి నాఆటోలోనే వచ్చారు. ఆటోలో నేను పెట్టిన పాటలకు అనుగుణంగా బాబు పాటలు పాడుతూ డ్యాన్స్ చేశాడు. నేను బస్టాండ్ వద్దే ఉన్నా. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడం, స్తంభం పడిపోయి మంటలు రావడంతో అందరం భయపడ్డాం. అప్పటి వరకూ మాట్లాడుకుంటూ వచ్చి మృతి చెందడం బాధగా ఉంది.

– సతీశ్, ఆటోడ్రైవర్

పార్కులను పూర్తి చేయాలి



పార్కు పనులను పరిశీలిస్తున్నఅదనపు కలెక్టర్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో చేపట్టిన చిల్డ్రన్ పార్కు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. గురువారం రామునిచెరువు, రాంనగర్, సాయికుంట చెరువు ప్రాంతాల్లో కొనసాగుతున్న చిల్డ్రన్ పార్కు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, తహసీల్దార్ భోజన్న, మున్సిపల్ ఇంజినీర్ మధుకర్, ఏఈ రాజేందర్ ఉన్నారు.

పోటా పోటీగా కాంగ్రెస్ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు



హోటల్‌లో టీ చేస్తున్న మాజీ మంత్రి వినోద్

బెల్లంపల్లి: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్‌జోడో యాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ పిలుపు మేరకు గురువారం బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్సీ కె.ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు, మాజీమంత్రి గడ్డం వినోద్ వేర్వేరుగా పాదయాత్ర చేసి మరోసారి వర్గపోరును బయటపెట్టుకున్నారు. కన్నాల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రారంభమైన యాత్ర కాంటాచౌరస్తా వరకు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వేర్వేరుగా పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకుని ఒకరి తర్వాత ఒకరు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు పార్టీ కార్యాలయానికి వినోద్ చేరుకోగా ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు వినోద్ గో బ్యాక్, స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. టీపీసీసీ సభ్యుడు సీహెచ్ శంకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, ఎల్‌డీఎం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఖలీద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, మహిళా కాంగ్రెస్ నాయకురాలు రొడ్డ శారద, ఏఎంసీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.